క్లుప్తంగా

ఆధార్ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి



ఫిరంగిపురం: ఆధార్ ప్రత్యేక శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో వెంకటేశ్వరరావు అన్నారు. మండల కేంద్రంలోని మార్నింగ్ స్టార్ కళాశాలలో మంగళవారం ఆధార్ ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ నెల 25 వరకు నిర్వహించే ఆధార్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు.

సామూహిక ఎలుకల నివారణ మందు పంపిణీ



ఫిరంగిపురం: మండలంలోని మేరికపూడి, గుండాలపాడు, బేతపూడి, యర్రగుంట్లపాడు, 113 తాళ్లూరు, తక్కెళ్లపాడు గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పంట పొలాలను నాశనం చేస్తున్న ఎలుకల నివారణపై రైతులకు అవగాహన కల్పించారు. వ్యవసాయ విస్తరణాధికారి సుభాని మాట్లాడుతూ సామూహిక ఎలుకల నివారణకు 96 శాతం నూకలు, రెండు శాతం వంటనూనే, బ్రోమోడైలిన్ మందు రెండు శాతం కలిపి ఉంచాలని చెప్పారు. అనంతరం పదిశాతం వంతున కాగితం పొట్లాల్లో కట్టి పొలంలోని బొరియల్లో వేయాలని చెప్పారు. అనంతరం మందును పొలాల్లోని బొరియాల్లో వేయించారు.

వంగవీటి రాధాకు మంత్రి లోకేష్ పరామర్శ



తాడేపల్లిరూరల్: గుంటూరు జిల్లా ప్రాతూరులో నివాసముంటున్న వంగవీటి రాధాను, ఆయన కుటుంబ సభ్యులను రాష్ట్ర మంత్రి నారా లోకేష్ మంగళవారం పరామర్శించారు. ఇటీవల వంగవీటి రాధా అస్వస్థతకు గురికావడంతో ఓ ప్రైవేటు ఆసుపత్రిలో వైద్య నిమిత్తం చేర్పించారు. వైద్యులు ఆయనకు శస్త్ర చికిత్స నిర్వహించారు. ఆయన ఆరోగ్య పరిస్థితి గురించి రాధా, ఆయ కుటుంబ సభ్యులతో మంత్రి లోకేష్ చర్చించారు. త్వరగా కోలుకుని పార్టీ కార్యాక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని ఆకాంక్షించారు.

ఎలుకలను నివారించండి



తాడేపల్లిరూరల్ : దుగ్గిరాల మండల పరిధిలోని 17 గ్రామాల్లో వరి పంటలో ఎలుకల నివారణకు వ్యవసాయ శాఖ అధికారులు మంగళవారం విస్తృత ప్రచారం నిర్వహించారు. రైతు సేవా కేంద్రాల్లో ఎలుకల నివారణ మందు పంపిణీ చేశారు. మండల వ్యవసాయ అధికారి పి.శిరీష మాట్లాడుతూ ప్రభుత్వం పంట పొలాల్లో ఎలుకలను నివారించేందుకు బ్రమోడీఎలోన్ విషపు ఎరను తయారు చేసి, రైతులకు ఉచితంగా పంపిణీ చేస్తోందని చెప్పారు. ఈ మందును వినియోగిస్తే చాలా వరకు పంట దిగుబడిని పెంచుకోవచ్చని చెప్పారు. మందును ఎలా వినియోగించాలో రైతులకు వివరిస్తున్నట్లు తెలిపారు. పంచాయతీ సెక్రటరీ, రైతులు, వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

'సత్యసాయి' విద్యార్థుల ప్రతిభ



తాడికొండ: ఎస్‌జీఎఫ్ జిల్లా స్థాయి అండర్–14, 17, 19 విభాగాలకు నిర్వహించిన పోటీలలో తమ పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలిచారని సత్యసాయి హై స్కూల్ ప్రిన్సిపల్ బి.కరుణాకర్ తెలిపారు. గుంటూరు బీఆర్ స్టేడియంలో 22వ తేదీ వరకు నిర్వహించిన ఈ పోటీలలో అండర్–14లో వై.అవినాష్, షేక్ నాషీన్, అండర్–17లో వై.అభిషేక్, షేక్ గఫూర, అండర్–19 కేటగిరీలో పూర్ణిమ, బాలుర విభాగంలో షేక్ ముబారక్ ప్రతిభ కనబరిచారన్నారు. ఈ నెల 21న మందపాడు జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి జట్ల ఎంపికలో షేక్ ఫయాజ్, పి.వెన్నల ఎంపికై టనట్లు చెప్పారు. విద్యా సంస్థల కరస్పాండెంట్, మాజీ ఎమ్మెల్సీ రాయపాటి శ్రీనివాస్, సీఈవో అమల విద్యార్థులను, శిక్షణ ఇచ్చిన పీఈటీ అనిల్ కుమార్‌ను అభినందించారు.

ఆహారమే.. ఆరోగ్యం

- ఆరోగ్యానికి రక్షణ ఆయుర్వేదం
- వాతావరణ మార్పులతో వెంటాడుతున్న రోగాలు
- విష జ్వరాలతో ఆసుపత్రులకు..
- చికిత్స పొందినా..తప్పని సైడ్ ఎఫెక్ట్స్
- ఆరోగ్య జాగ్రత్తలు, పరిశుభ్రత తప్పనిసరి
- ఆహార నియమాలతో సగం వ్యాధులు దూరం



తాడేపల్లిరూరల్: మన ఆహార నియమాలే.. మన ఆరోగ్య జీవన గమనాన్ని నిర్ణయిస్తాయి. ఎంతటి రోగాన్ని అయిన తట్టుకునే రోగ నిరోధక శక్తిని పెంపొందిస్తాయి. వాతావరణ మార్పులతో శరీరానికి సుస్తి చేసినా..వెంటనే కోలకునే శక్తినిస్తాయి. ఇందుకు ఆయుర్వేదమూ ఉపకరిస్తుంది. అంతకంటే ముందు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత చాలా ముఖ్యం. ప్రస్తుతం వాతావరణంలో తీవ్ర మార్పులు కనిపిస్తున్నాయి. వైరల్ జ్వరాలు నానాటికీ ఎక్కువ అవుతున్నాయి. చికిత్సతో జ్వరం తగ్గుముఖం పట్టినా కీళ్ల నొప్పులు వేధిస్తున్నాయి. కరోనా సమయంలో వాడిన మందులు, ఇతరత్రా కారణాల వల్ల ప్రజల్లో రోగనిరోధక శక్తి తగ్గిందనేది వైద్యుల మాట. ఇందుకు పరిష్కారం రోగ నిరోధక శక్తిని పెంపొందించే ఆహార పదార్థాలు తీసుకోవడమే.. శారీరక శక్తి మాత్రమే కాకుండా.. మానసికంగా ధృడంగా ఉండాలి. చల్లటి వాతావరణం ప్రభావంతో వాత, పిత్త, కఫ స్వభావాలు వ్యక్తులను బట్టి స్పందిస్తూ ఉంటాయి. కఫతత్వ వ్యక్తుల్లో ఈ కాలంలో కఫం పేరుకుపోయి ఉంటుంది. అయితే ఈ సమస్యను ఆయుర్వేద వైద్యంతో సరిచేయవచ్చని నిపుణులు అంటున్నారు. సరైన ఆయుర్వేద చికిత్సతో వంశ పారంపర్యంగా సంక్రమించిన, వాతావరణ హెచ్చుతగ్గులతో లోనయ్యే, వయసు రీత్యా తరిగే వ్యాధి నిరోధక శక్తిని సరిదిద్ది సంవత్సరం మొత్తం సమంగా ఉండేలా చేయవచ్చని చెబుతున్నారు. సమగ్రమైన ఆయుర్వేద విధానాలను ఆచరించడం మూలంగా సమతుల్యమైన శాశ్వతమైన వ్యాధి నిరోధక శక్తిని పొందవచ్చు. పని ఒత్తిడి, పెయిన్ మేనేజ్‌మెంట్, అధిక బరువు నియంత్రణ, గైనకాలజీ సమస్యలతో పాటుగా విరేచనం, వాస్త, నస్యం, రక్తమోక్షనం, ఆర్థరైటిస్, స్పాండిలైటిస్ వంటివి సులభంగా తగ్గించుకోవచ్చని చెబుతున్నారు. ప్రపంచంలో అత్యంత పరిపూర్ణమైన, సశాస్త్రీయమైన వైద్య విధానం ఆయుర్వేదమే అంటున్నారు.

సులభమైన పద్ధతులు

ఆహార నియమాలు సరిగా పాటిస్తే సగం రోగాలు నయం చేయవచ్చు. మితాహారం, తగినంత నిద్ర వంటి సూత్రాలు పాటించడం ద్వారా ఆరోగ్యమైన జీవన విధానాన్ని అలవర్చుకోవచ్చు. అలాగే వ్యక్తిగత, పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. ఇంటిలోకి దోమలు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. తుమ్మినా, దగ్గినా చేతి రుమాలను అడ్డం పెట్టుకోవాలి. ఆహారం చేసేముందు, తినేటప్పుడు చేతులను బాగా శుభ్రం చేసుకోవాలి. కాచి చల్లార్చిన నీటిని తాగాలి. వేడి వేడిగా ఆహార పదార్థాలను తీసుకోవాలి.

ఇవి పాటిస్తే మేలు..

రోగ నిరోధక శక్తిని పెంచుకోవడానికి అశ్వగంధ, ఉసిరి, శొంఠి, పసుపు, ధనియాలు మొదలైన వాటిని తగిన రీతిలో తీసుకోవాలి. శరీరానికి సరిపడ స్థాయిలో ద్రవ పదార్థాలు తీసుకోవాలి. పగటిపూట నిద్రించకూడదు. రాత్రిళ్ల మెళకువగా ఉండొద్దు. తరచూ ఉద్వేగాలకు లోనుకాకుండా.. ప్రశాంతంగా ఉండేలా చూసుకోవాలి. వీలైనంత తక్కువగా మాంసాహారం తినటం మేలు. ఇంటిలోకి కూడా మంచి గాలి, వెలుతురు వచ్చేలా చూసుకోవాలి. శరీరానికి మంచి గాలి, ఎండ తగిలేలా దుస్తులు ధరించాలి.

పౌష్టికాహారమే తీసుకోవాలి



ఆయుర్వేద వైద్యం ప్రకారం పౌష్టికాహారంగా ఉండాలి. అగ్ని దీపనం (ఆకలి పెరగాలి), ఆమపాచకం (అరుగుదల కావాలి) తద్వారా శరీరంలోకి ఎలాంటి చెడు బ్యాక్టీరియా చేరదు. కలుషిత ఆహారం, పాడైపోయినవి తిన్నా, దోమలు కుట్టినా జ్వరాలు బారిన పడక తప్పదు. ప్రాచీన వైద్య శాస్త్రం ప్రకారం మంచి ఆహారపు అలవాట్లు అలవర్చుకోవాలి. రోగనిరోధక శక్తిని పెంపొందించుకోవాలి.

– డాక్టర్ శ్రీనివాస్ నాయక్, సీనియర్ మెడికల్ ఆఫీసర్, ప్రభుత్వ ఆయుర్వేద హాస్పిటల్

సైబర్ నేరాలపై గ్రామస్తులకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

తాడేపల్లిరూరల్: వడ్డేశ్వరం కేఎల్ విశ్వవిద్యాలయం కంప్యూటర్ సైన్స్ ఎన్ఎస్ఎస్ విభాగం వలంటీర్లు మంగళవారం దుగ్గిరాల మండల పరిధిలోని శృంగారపురం గ్రామంలో సైబర్ నేరాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కేఎల్‌యూ కాలేజ్ ఆఫ్ సైన్స్ డాక్టర్ కె. సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ రోజుకో కొత్త పంథాలో జరుగుతున్న సైబర్ నేరాలకు గురికాకుండా ఉండాలంటే.. వాటిపై అవగాహన పెంచుకోవాలని అన్నారు. ఎక్కువగా ఫేస్‌బుక్, ట్విట్టర్, ఇన్‌స్టాగామ్, వాట్సాప్, టెలిగ్రాం, ఓఎల్‌ఎక్స్ తదితర సోషల్ మీడియా ద్వారానే ఈ నేరాలు జరుగుతున్నాయన్నారు. ఉన్నత విద్యావంతులు, ఉద్యోగులు కూడా వీరి ఉచ్చులో పడి మోసపోతున్నారని బీసీఏ విభాగాధిపతి డాక్టర్ కె. భగవాన్ వివరించారు. సైబర్ నేరాలకు గురైతే భయపడకుండా 1930 ప్రభుత్వ కాల్ సెంటర్‌కి ఫోన్ చేసి, ఫిర్యాదు చేయాలని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ డి.ఉషారాణి తెలిపారు. వలంటీర్లను, ఎన్ఎస్ఎస్ ఫీల్డ్ కో–ఆర్డినేటర్ పి. సురేష్, వర్సిటీ వీసీ జి.పార్థసారథి వర్మ, ప్రో వీసీలు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్. వెంకట్రామ్, డాక్టర్ కె.రాజశేఖరరావు, స్టూడెంట్ అఫైర్స్ డీన్‌లు డాక్టర్ కేఆర్ఎస్ ప్రసాద్, డాక్టర్ హబీబుల్లా ఖాన్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ డాక్టర్ పి. శ్రీకాంత్ రెడ్డి అభినందించారు.

డ్వాక్రా మహిళకు సన్మానం



సయ్యద్ నహరే నిగర్ సుల్తానాను అభినందిస్తున్న మెప్మా మిషన్ డైరెక్టర్ తేజ్ భరత్

తాడేపల్లిరూరల్ : అత్యధిక అమ్మకాలు నిర్వహించిన మహిళలను మంగళవారం తాడేపల్లి మెప్మా కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. మెప్మా మిషన్ డైరెక్టర్ ఎస్.తేజ్ భరత్ తెనాలికి చెందిన సయ్యద్ నహరే నిగర్ సుల్తానాకు శాలువా కప్పి పుష్ప గుచ్ఛంతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు అక్టోబర్ 10 నుంచి 20వ తేదీ వరకు విజయనగరంలో నిర్వహించిన అఖిల భారత సరస్ ఎగ్జిబిషన్‌లో మెప్మా ద్వారా 28 స్టాల్స్‌లో 47 స్వయం సహాయక సంఘ సభ్యులు తయారు చేసిన ఉత్పత్తులను ప్రదర్శించినట్లు చెప్పారు. జిల్లా తరుపున తెనాలి పట్టణానికి చెందిన సయ్యద్ నహరే నిగర్ సుల్తానా, శుభానల్లా, ఎస్‌హెచ్‌జీ సంఘ సభ్యురాలు తయారు చేసిన క్రిస్టల్ బ్యాగ్, ఆర్టిఫిషియల్ జ్యూయలరీ ఉత్పత్తుల ద్వారా రూ. 2,67,000 అమ్మకాలు చేసినట్లు చెప్పారు. ఎగ్జిబిషన్‌లో పాల్గొన్న ఎస్‌హెచ్‌జీల కన్నా అధికాంగా విక్రయాలు చేయడం జరిగిందని తెలిపారు. ఆమెతో పాటు గ్రూప్ సభ్యులందరికీ కలిపి ఒక గ్రూప్ యూనిట్ కట్టుకునేలా తగిన ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా సుల్తానా, శుభానల్లాలు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మునిసిపల్ మంత్రి నారాయణ, మెప్మా మిషన్ డైరెక్టర్ తేజ్ భరత్‌లకు కృతజ్ఞతలు తెలియజేశారు.

విష మొక్కలు తిని 12 గొర్రెలు మృతి



మృతి చెందిన గొర్రెలు

తూములూరు(కొల్లిపర): విషం మొక్కలు తిని 12 గొర్రెలు మృతి చెందిన సంఘటన మంగళవారం తూములూరు గ్రామంలో చోటు చేసుకుంది. మండల పరిధిలోని తూములూరు గ్రామ శివారు లంబాదిపాలెంకు చెందిన బాణవత్ బుషి నాయక్ తూములూరు గ్రామంలోని ప్రధాన కూడలిలో ఒక ఖాళీ స్థలంలోకి గొర్రెలన్నింటినీ పచ్చి మేత కోసం పంపించాడు. పంపిచిన 10 నిముషాల్లో సుమారు 12 గొర్రెలు మృత్యువాతకు గురయ్యాయి. ఏమి జరిగిందే తెలియక వెంటనే మండల పశువైద్యులకు సమాచారం ఇవ్వగా కంపొండర్ వెంటనే సంఘటన స్థలానికి వచ్చి బతికి ఉన్న గొర్రెలకు ప్రథమ చికిత్స చేశారు. మృతి చెందిన వాటిని కొల్లిపర లోని పశు వైద్య శాలకు తరలించారు. మండల పశు వైద్యాధికారి డాక్టర్ సాయి సతీష్‌రాజు, తూములూరు జూనియర్ వెటర్నర్ ఆఫీసర్ డాక్టర్ సుభాని మృతి చెందిన మేక పోతులకు పోస్ట్ మార్టర్ చేయగా అవి విషం ఉన్న మొక్కలు తినటం వలన మృత్యు వాతపడ్డాయని గుర్తించారు. ఇదే స్థలంలో 15 రోజుల క్రిందట వేరొక మేకల కాపరికి చెందిన మూడు మేకలు మృతి చెందడం గమనార్హం. రెండేళ్ల కిందట కూడా ఇలాగే నాలుగు గొర్రెలు మృతి చెందిన సంఘటన గుర్తు చేసుకున్నారు. మృతి చెందిన 12 గొర్రెలు విలువ సుమారు రూ.3 లక్షలుగా అంచనా వేశారు.

ఎలుకల నివారణ చర్యలు చేపట్టాలి

ఏడీఏ ఎన్. ఉషారాణి



ఎలుకల నివారణ గురించి వివరిస్తున్న ఏడీఏ ఉషారాణి

తెనాలిరూరల్: ప్రతి రైతు ఎలుకల నివారణ చర్యలు చేపట్టాలని, దీని ద్వారా నష్టాన్ని తగ్గించుకోవచ్చని ఏడీఏ ఎన్. ఉషారాణి తెలిపారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో సామూహిక ఎలుకల నివారణ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. అన్ని గ్రామాల్లోని రైతు సేవా కేంద్రంలో ఎలుకల నివారణ మందు తయారీని రైతులకు వివరించారు. బుర్రిప్రాలెంలో జరిగిన కార్యక్రమంలో తెనాలి వ్యవసాయ సహాయ సంచాలకురాలు ఉషారాణి పాల్గొన్నారు. ఎలుకల నివారణ కోసం బ్రోమోడయోలిన్ మందు తయారీ గురించి రైతులకు వివరించారు. 100 గ్రాముల మందు కోసం రెండు గ్రాముల బ్రోమోడియాలిన్ మందు, రెండు గ్రాముల నూనె, 96 గ్రాముల నూకలను తీసుకొని వీటిని అన్నింటినీ కలపాలని చెప్పారు. తయారు చేసుకున్న మందును పది గ్రాములు చొప్పున ఒక్కొక్క ప్యాకెట్‌గా పేపర్‌లో మడతపెట్టి ఎలుకల బొరియల్లో వేయాలని సూచించారు. కంచర్లపాలెంలో తెనాలి మండల వ్యవసాయ అధికారి జి. ప్రేమ్‌సాగర్ పాల్గొన్నారు.

ఎలుకల నివారణతో దిగుబడులు

కొల్లిపర: వరి పంటలో రైతులు అందరూ కలసి సామూహికంగా ఎలుకల నివారణతో అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి కె.వెంకటరావు అన్నారు. వరి పంటలో సామూహిక ఎలుకల నివారణ కోసం మంగళవారం మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో ఉచితంగా రైతులకు బ్రోమోడేయోలిన్ మందు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీసాయిక్షేత్రం వార్షికోత్సవం



సాయిబాబాకు హారతి

తెనాలి: రూరల్ మండల గ్రామం నందివెలుగులోని షిర్డి సాయిబాబా మందిరం 'శ్రీసాయి క్షేత్రం'లో మంగళవారం 12వ వార్షిక మహోత్సవాలు వైభవంగా జరిగాయి. ఉదయం కాకడ హారతితో మొదలై, సాయిబాబా, దత్తాత్రేయ స్వామికి మహన్యాస పూర్వక ఏకాదశ సుగంధ ద్రవ్యాది సహిత పంచామృత అభిషేకం నిర్వహించారు. తెనాలికి చెందిన శారదా చలపతి బృందంచే శ్రీసాయినామ సంకీర్తన భక్తులకు శ్రవణానందం కలిగించింది. విశిష్ట అతిథులచే శ్రీషిర్డీ సాయినాథుని లీలా ప్రవచనామృతం' తదుపరి మధ్యాహ్న హారతిని వెంపటి చిన సత్యనారాయణ చేశారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. సాయంత్రం సంధ్య హారతి తదుపరి సాయినాథుని ఊరేగింపు ఉత్సవం నందివెలుగు పురవీధుల్లో సన్నాయి మేళాలు, కీర్తనలు, కోలాటం, నృత్యాలతో కొనసాగింది. గ్రామస్తులు పెద్ద ఎత్తున ఊరేగింపును సందర్శించి, స్వామిని దర్శించుకున్నారు. ఇటీవల దసరా శరన్నవ రాత్రుల్లో భాగంగా బాలబాలికలకు నిర్వహించిన బాబా సచ్చరిత్ర, శ్రీసాయిబాబాపై క్విజ్ పోటీల్లో విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. శ్రీసాయిబాబా పవళింపు సేవ అనంతరం శేజ్ హారతితో కార్యక్రమాలను ముగించారు. శ్రీసాయి క్షేత్రం చైర్మన్ ఆదిపూడి సాయిరాం, ఎ.సాంబశివరావు, వెంపటి చిన్న సత్యనారాయణ, టి.శ్రీనివాస్ బాబు, శారదా చలపతి, కార్యదర్శి ఎం.శ్రీవల్లీ అన్నపూర్ణ, సుకుమార్, పార్వతి, సీహెచ్ పద్మావతి, ఎంవీఎల్ సాయికృష్ణ, ఎంవీఎల్ ఫణికృష్ణ పాల్గొన్నారు.

బాణ సంచా విక్రయ కేంద్రంగా టీజే కాలేజీ మైదానం

వ్యాపారుల సమావేశంలో అధికారుల ప్రకటన



కాలేజీ మైదానాన్ని పరిశీలిస్తున్న అధికారులు



వ్యాపారులతో సమావేశం నిర్వహిస్తున్న అధికారులు

తెనాలి: దీపావళి పర్వదినం సందర్భంగా ఏర్పాటుచేసే బాణాసంచా విక్రయ కేంద్రంగా స్థానిక కొత్తపేటలోని టీజే కాలేజీ మైదానాన్ని ఎంపిక చేశారు. స్థానిక మండల తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం బాణాసంచా హోల్‌సేల్ / రిటైల్ వ్యాపారులతో సమావేశం ఏర్పాటుచేశారు. మండల తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ అధ్యక్షత వహించారు. మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న పాల్గొన్నారు. బాణాసంచా స్టాల్స్ ఏర్పాటుకు అనువైన ప్రదేశంపై జరిగిన చర్చల్లో వ్యాపారుల వినతి ప్రకారం టీజే కాలేజీ మైదానంలో నిర్వహించేందుకు అధికారులు అంగీకారం తెలిపారు. అక్కడైతే వినియోగదారులకూ అందుబాటులో ఉంటుందనే భావన వ్యక్తమైంది. బాణాసంచా అమ్మకాల లైసెన్సు కోసం జిల్లా కలెక్టర్ ఆదేశాల ప్రకారం ఈనెల 26వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. తహసీల్దార్ కార్యాలయంలోనే సింగిల్ విండో విధానంలో అనుమతిని ఇస్తామన్నారు. హోల్‌సేల్ వ్యాపారులు వీధుల్లో విక్రయించే నిమిత్తం తోపుడుబండ్ల వ్యాపారులకు బాణాసంచాను కేటాయించరాదని ఆదేశించారు. బాణాసంచా విక్రయ దుకాణాల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ పిల్లలను నియమించరాదని చెప్పారు. బాణాసంచా వ్యాపారులు నిబంధనలను కచ్చితంగా పాటించాలని స్పష్టం చేశారు. బాణాసంచా దుకాణాలు ఎల్ ఆకారంలో ఏర్పాటు చేయాలనీ, ఒక్కో దుకాణానికి మధ్య మూడు మీటర్ల దూరం ఉండాలని చెప్పారు. ప్రతి దుకాణంలోనూ ఇసుక బకెట్లు, నీటి వసతిని అందుబాటులో ఉంచుకోవటం తప్పనిసరిగా తెలియజేశారు. దీనికి ముందు ఉదయం పట్టణంలోని టీజే కాలేజీ, వీఎస్సార్ అండ్ ఎన్వీఆర్ కాలేజీ మైదానాలను తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ, మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న పరిశీలించారు.

టీచ్ టూల్ అబ్జర్వేషన్ త్వరగా పూర్తి చేయండి



మాట్లాడుతున్న ఎంఈవో లక్ష్మీనారాయణ

తెనాలిఅర్బన్: టీచ్ టూల్ అబ్జర్వేషన్ త్వరగా పూర్తి చేయాలని ఎంఈవోలు మేకల లక్ష్మీనారాయణ, వి.జయంతిబాబు సూచించారు. కొత్తపేటలోని మండల విద్యాధికారి కార్యాలయంలో మంగళవారం టీచ్ టూల్, టీపీడీ మ్యాథ్స్ కోర్స్ కోర్సులపై సమీక్ష జరిపారు. గత నెలలో నిర్వహించిన రివ్యూలో సూచించిన విధంగా పలు ప్రభుత్వ పాఠశాలలో అబ్జర్వేషన్ పూర్తి కాకపోవడంపై కొంత అసహనం వ్యక్తం చేశారు. నవంబర్ నాటికి మొత్తం పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో కో–ఆర్డినేటర్ తోట వీరయ్య, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తాడేపల్లి రూరల్ : తాడేపల్లి రూరల్ పరిధిలోని కొన్ని ప్రాంతాల్లో బుధవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సురేష్‌బాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నూతన విద్యుత్ లైన్ నిర్మాణం పనుల నిమిత్తం ఆశ్రమం రోడ్డు, పాతూరు ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, చిర్రావూరు గ్రామంలో మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని, విద్యుత్ వినియోగదారులకు సహకరించాలని పేర్కొన్నారు.

వ్యాయామ ఉపాధ్యాయుడికి సత్కారం



తాడేపల్లిరూరల్: తాడేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు రాంబాబును హెచ్‌ఎం తాడిరెడ్డి మంగళవారం ఘనంగా సత్కరించారు. తాతిరెడ్డి మాట్లాడుతూ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ స్వర్ణోత్సవాల్లో భాగంగా ఉపాధ్యాయుల ఆటల పోటీల్లో 400 మీటర్ల నడక పోటీల్లో జిల్లా స్థాయిలో మూడవ స్థానం సాధించారని చెప్పారు. ఉపాధ్యాయులు కోటేశ్వరరావు, అనిల్‌కుమార్, అన్వర్ తదితరులు అభినందించారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ



మేడికొండూరు: మండలంలోని డోకిపర్రు అంగన్ వాడీ కేంద్రాన్ని మంగళవారం ఎంపీడీవో తోట చందన ఆకస్మిక తనిఖీ చేశారు. మెనూ ప్రకారం ఆహారం వండుతున్నారా లేదా అని పరిశీలించారు. ఆహారం రుచి చూశారు. గర్భిణులు, బాలింతలతో మాట్లాడారు. అంగన్ వాడీ కేంద్రానికి రూ.10 వేలతో పోషణ వాటిక, రూ.16 వేలలో వర్షపు నీటి నిల్వ నిర్మాణాలు, రూ.17 వేలతో తాగునీటి కనెక్షన్లు మంజూరైనట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సిబ్బంది తోట శివ పార్వతి, గుంటుపల్లి నాగలక్ష్మి పాల్గొన్నారు.

సూరత్‌కు అంబేడ్కర్ కాంస్య విగ్రహాలు

తెనాలి: పట్టణంలోని సూర్య శిల్పశాల, కాటూరి ఆర్ట్ గ్యాలరీ నిర్వాహకులు కాటూరి వెంకటేశ్వరరావు, కుమారుడు రవిచంద్ర డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ ఫైబర్ గ్లాస్, కాంస్య విగ్రహాలను రూపొందించారు. గుజరాత్‌లోని సూరత్ పట్టణంలో ప్రతిష్ఠ నిమిత్తం ఈ విగ్రహాలను మంగళవారం ప్రత్యేక వాహనంలో అక్కడికి తరలించారు.

షూటింగ్ బాల్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



తాడికొండ: రాష్ట్ర స్థాయి షూటింగ్ బాల్ పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారని తాడికొండ ఎస్‌వీవీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఏవీవీ వరప్రసాద్ తెలిపారు. మంగళవారం కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ఈ నెల 19 నుంచి 21 వరకు అనంతపురంలోని నార్పలలో జరిగిన 43వ ఏపీ ఇంటర్ డిస్ట్రిక్ట్ సీనియర్స్ మెన్ అండ్ ఉమెన్ షూటింగ్ బాల్ పోటీలలో విద్యార్థులు రాంప్రకాష్, ఫయాజ్, ఏడుకొండ పాల్గొన్నట్లు చెప్పారు. గుంటూరు జిల్లా జట్టు ప్రాతినిధ్య వహించారని, విజేతలుగా నిలిచారని తెలిపారు. రాష్ట్ర జట్టుకు రాంప్రసాద్, ఫయాజ్ ఎంపియ్యారన్నారు. ఇది తమ పాఠశాలకు గర్వ కారణమన్నారు. శిక్షణ అందించిన పీఈటీ సుంకర శ్రీనివాస్, క్రీడాకారులను స్కూల్ చైర్మన్ మార్కంపూడి రవి, హెచ్‌ఎం ఘనంగా సత్కరించారు.

మహా సభలను జయప్రదం చేయండి

సీపీఐ తెనాలి కార్యదర్శి సింగారావు

తెనాలిఅర్బన్: ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఈ నెల 25, 26 తేదీల్లో గుంటూరులో జరిగే జిల్లా మహాసభల్లో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని సీపీఐ పట్టణ కార్యదర్శి చెరుకుమల్లి సింగారావు, సీనియర్ నాయకులు బొల్లిముంత కృష్ణలు పిలుపునిచ్చారు. గాంధీనగర్‌లోని సీపీఐ కార్యాలయంలో ఏఐఎస్ఎఫ్ తెనాలి నియోజకవర్గ కార్యవర్గ సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే పోరాట పటిమలను కలిగి ఉండాలన్నారు. సమస్యలపై పోరాటాలు చేస్తూ వాటిని సాధించే దిశగా ప్రయత్నించాలని సూచించారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు పాశం వెంకటేష్ మాట్లాడుతూ విద్యార్థుల సమస్యల పరిష్కరించడంలో తమ సంస్థ ముందు ఉందని తెలిపారు. అనంతరం తెనాలి నియోజకవర్గ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా గండు శివ, కార్యదర్శిగా చెన్నూరి సాయి, సహాయ కార్యదర్శిగా పొన్నెకంటి శోభిత్, ఉపాధ్యక్షునిగా కుర్రా పవన్, కోశాధికారిగా భూమేష్, కార్యవర్గ సభ్యులుగా దినేష్, జయదీప్, తేజ, మదన్‌మోహన్‌లను ఎన్నుకున్నారు. వీరిని నాయకులు అభినందించారు. కార్యక్రమంలో ఎస్టీయు నాయకులు కనపర్తి బెనహర్, తదితరుల పాల్గొన్నారు.